# దొరబాబు

ఫ్లాట్‌ఫారం మీదికి ఆయన చేరేసరికి రైలుకదిలింది. గబా గబా ఏ కంపార్ట్‌మెంట్ దొరికితే ఆ కంపార్ట్‌మెంటు అన్నట్టుగా ఎక్కిపోయాడు. అతని పెట్టే బెడ్డింగూ కంపార్ట్‌మెంటు లోకి విసిరేశాడు. ఆయన కూడా పోర్టర్‌కి ఇవ్వవలసిన డబ్బులు ప్లాట్ ఫాంమీదికి విసిరేశాడు. ఆ సెకండ్ క్లాస్ జెనరల్ కంపార్ట్‌మెంట్ ఆయనకు నచ్చినట్లు లేదు. ప్రయాణికులు విడిచేసిన పండ్ల తొక్కలూ,వేరుశెనక్కాయ తొక్కలు,చెరకుముక్కలు నమిలివేసిన పిప్పి .... కంపార్ట్‌మెంట్‌లో కాలుమోపడానికి వీల్లేకుండా అసహ్యంగా ఉన్నాయి. రెండో తరగతి ప్రయాణికుల వాల కం... టిప్‌టాప్‌గా ఉన్న ఆ దొరబాబుకి అసభ్యకరంగా తోచాయి. 'రెచ్‌డ్! న్యూసెన్స్! అనీ చీదరించుకున్నాడు. పాపం ఆయనకు కూర్చుందికి జాగాలేదు. ఆయన పరిస్థితికి ఎదుటి సీట్లో కూర్చున్న డెబ్భై అయిదేళ్ళ వయోవృద్ధురాలు జాలిపడింది.ఆమె స్వాతంత్ర్య సమర యోధురాలు పరిమళాదేవి. ఆ యోధురాలికి ఫ్రీడమ్ ఫైటర్‌గా రైల్వే శాఖ ఇచ్చిన ఏ.సి ఫస్ట్ క్లాస్ పాస్ ఉంది. ఆమెకు ఏ.సి ఫస్ట్‌లో ప్రయాణించే అర్హత ఉన్నా నేటి కుహనా గాంధేయవాది కాకపోవడం వల్ల 'గాంధీ క్లాస్ ' అని పిలువ బడే సెకండ్ క్లాస్‌లోనే ప్రయాణిస్తోంది.

ఈ టిప్‌టాప్ దొరబాబుకి పరిమళాదేవి తన జాగాలోనే కొంచెం చోటు కల్పించి... 'తమ్ముడివంటివాడివి రా బాబూ! 'అని ఆహ్వానించింది. ఆయన వచ్చి కూర్చుని " థాంక్స్ " అన్నాడు 'వెల్‌కమ్' అన్నదా గాంధేయవాదిని అయినా పరిమళాదేవి ఇచ్చిన జాగాతో దొరబాబు సంతృప్తి పడలేదు.కారణం ఆ దొరబాబు రెండు జఘనాల్లోనూ ఒక జఘనమే అక్కడ ఇమిడింది. " ఛీ! ఛీ! మైఫేట్! నా ఖర్మండి! ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ కొని సెకండ్ క్లాస్‌లో కూర్చోడం ' అని నుదుటి మీద చెయ్యి పెట్టి కొట్టుకున్నాడు. "మీరు ఫస్ట్ క్లాస్ టిక్కెట్ తీసుకున్నారా ?" కొద్ది ఆశ్చర్యంతో అడిగింది. పరిమళాదేవి. "యస్ నే నొచ్చేసరికి వెధవ ట్రెయిన్ కదిలిపోయిందండీ! "

" పోనీ వచ్చే స్టేషన్‌లో దిగిపోయి మీ ఫస్ట్‌క్లాస్‌లోకి మీరు వెళ్ళిపోవచ్చులెండి!" "నాదొక్క ఫస్ట్‌క్లాసే కాదు మేడమ్.ఎయిర్ కండిషన్డ్ కంపార్ట్‌మెంటు కూడాను.ఇదిగో టిక్కెట్ చూడండి!" అని టిక్కెట్ చూపాడు.నిజమే! పాపం ఎయిర్ కండిషన్డ్ ఫస్ట్ క్లాసే! "ఈ ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్ ఏ ఇంగ్లీషువాడు కనిపెట్టాడో కాని వాడికి సెల్యూట్ కొట్టాలి. హీట్‌లో కూల్, కూల్‌లో హీట్, ఏ ఎట్‌మాస్ఫియర్‌కి తగ్గట్టుగా ఆ ఎట్‌మాస్ఫియర్‌కి పని చేస్తుంది." సాధారణంగా మన భారతీయులు ఈ ఆధునిక యంత్రా లన్నీ కేవలం పాశ్చాత్యులెవరో కనిపెట్టేసినట్టు వాళ్ళని మెచ్చు కుంటుంటారు. కానీ పాశ్చాత్యులు భారతీయ జీవన విధానంలో శాంతి లభిస్తుందని, వేదోపనిషత్తులు, పురాణేతిహాసాలు,కావ్యాలు, ప్రబంధాలు,ఆంగ్లానువాదాల్లో చదువుకుని ఉత్తేజితులై పర్యాటకులుగా భారత దేశానికి వస్తున్నారు. మాక్స్ ముల్లర్ అనే జర్మన్ పండితుడు

మన వేదాలను అనువదించాడు. ఎడ్విన్ ఆర్నాల్డ్ అనే ఆంగ్ల పండితుడు 'భగవద్గీత'ను ఆంగ్లంలోకి అనువదించాడు. గోథెఅనే మరొక పాశ్చాత్య కవి మహాకవి కాళిదాసు వ్రాసిన శృంగార శాకుంతలాన్ని అనువదించాడు. రామకృష్ణ పరమహంస దగ్గరకు ఒక యువకుడు రోజూ వచ్చి "భగవద్గీతలో ఏముంది లెద్దూరు " అని విమర్శించేవాడు. ఒకనాడు హఠాత్తుగా "స్వామీ ! నేను పొరపాటుపడ్డాను.భగవద్గీత చాలా గొప్పది!" అన్నాడు. దానికి స్వామి అడిగారు.

" ఎవరైనా పాశ్చాత్య పండితుడు భగవద్గీత మిద ఉపన్యాసం ఇస్తుంటే విన్నావా? " అని ఆ యువకుడు ఆశ్చర్యపోయి 'మహనుభావా! నేను పాశ్చాత్యుని ఉపన్యాసం విన్నట్టు తమకెలా తెలిసింది?' అని." మన గొప్పతనాన్ని పాశ్చాత్యులు చెబితేనేగానీ మనకు తెలియదు కనుక!" అన్నారు స్వామి. దానికా యువకుడు సిగ్గుపడ్డాడు. ఇప్పుడు పాశ్చాత్యనాగరికతా అభిమాని అయిన ఈ దొరబాబు అన్నీ విదేశీయులే కనిపెట్టారనుకుంటున్నాడు. పాశ్యాత్యులు కనిపెట్టడం నిజమే కానీ వాటికి మూలం మన వేదాల్లో ఉంది. పాశ్యాత్య వ్యామోహం కలవారికి తగిన విధంగా నచ్చజెప్పాలని స్వాతంత్ర్య సమరయోధురాలైన పరిమళాదేవి భావించింది. " అయ్యా! తమరేవైనా తెలుగు గ్రంధాలు చదివారా?"

"లేదు ఏమిటందులో గ్రేట్ నెస్?"

" కృష్ణ దేవరాయల కాలంలో అతని ఆస్థాన కవులలో ఒక రైన నంది తిమ్మనగారు తన 'పారిజాతాపహరణం ' లో పారిజాతపుష్పంలో ఉన్న విశేషాలను వర్ణిస్తూ అంటారు. " నెలకొని వేసవి చలువయు చలివేళల ఉష్ణ గుణము సముచిత భంగిన్ కలిగించు ఈ లతాంతము కొలదులు చెప్పంగ నిచ్చ క్రొత్తలు సుమ్మీ!"

అంటే పారిజాతం,వేసవిలో చల్లదనాన్ని, చలికాలంలో వెచ్చదనాన్ని సమంగా ఇచ్చే ఎ.సి ఫ్లవర్ అన్నమాట! ఇటు వంటివి చదవకే పాశ్చాత్యుల మోజులో పడిపోతున్నాం" అని పరిమళాదేవి తన మినీ లెక్చర్‌ని ముగించింది. సహ ప్రయాణికులు కూడా పరిమళాదేవి మాటల్ని శ్రద్ధాసక్తులతో విన్నారు.

ఆ టిప్‌టాప్ పెద్ద మనిషి ఇహనేమీ మాట్లడలేకపోయాడు. హేండ్ బ్యాగ్‌లోని ఇంగ్లీషు నవలొకటి తీసి మొహం చాటేసుకున్నాడు.

"ఇలాంటిపుస్తకాలు చదవడం వల్ల ప్రయోజనం ఏమిటండీ? వీటి వల్ల విజ్ఞానం కలుగదు. సరికదా ఉన్నకాస్త తెలివీ తెల్లవారిపోతుంది. " అన్నది పరిమళాదేవి.

" జస్ట్ టు కిల్ ది టైమ్ " అన్నాడా దొరబాబు. " వీ కెనాట్ కిల్ ద టైమ్! టైమ్ విల్ కిల్ అజ్! " అంది పరిమళాదేవి. "మన ఆయువు ఎంత కాలమో ? ఆ కాలం మూడినప్పుడు,కాలం చేసేది మనమే! కాలం కాదు! కాలం కలకాలం ఉంటుంది. " అన్నదా దేశ భక్తురాలు. ఇంతలో స్టేషన్ వచ్చింది. " ఏయ్ పోర్టర్! సామాను పక్క కంపార్ట్‌మెంట్‌లో పారేయ్! చస్తున్నాను! ఓ మై గాడ్ అని గోల పెట్టేడా టిప్ టాప్ దొరబాబు.

18-11-2001

ఆదివారం ఆంధ్రప్రభ